# వింత స్వభావము

సాయంత్రం, సంధ్యారుణ రేఖలు ఒకటొక్కటే నీలాకాశంలో లీనమైపోయి, మసక చీకటి కమ్ముతోంది. మేడపై డాబామీద, తలదువ్వుకుంటోంది శ్యామల, కాస్త చిరాకుతో. రోజూ, ఈపాటికి, చక్కగా తలదువ్వుకుని, తలనిండా పువ్వులు పెట్టుకొని, తెల్లని, మల్లెపూవులాంటి చీర కట్టుకుని, భర్త రాకకు వేచియుండేది. కాని, ఈవాళ మాత్రం, అంత ఉత్సాహంతో ముస్తాబు కావడం లేదు. రాత్రి డిన్నరు! ఈ డిన్నర్లకి వెళ్ళడమంటే తలనొప్పి ఆమెకు! ప్రొద్దున్న ఆఫీసుకు బయలుదేరుతూ చెప్పిపోయాడు అతను, కామేశ్వర రావు, "రాత్రి మా క్లబ్ లో డిన్నరూ, మా ఆఫీసు ఉద్యోగస్తులందరూ సకుటుంబంగా వస్తారు - నీవు రాక తప్పదు. పెందరాళే తయారై ఉండు" అన్నాడు. తనకి వెళ్ళాలని లేదు. కాని. ఆతని మాట కాదనలేదు.

ఈ పార్టీలు, డిన్నర్లు శ్యామలకు ఏమాత్రము కిట్టవు. ఎంతో ప్రయత్నపడి వెళ్ళాలి. తీరా వెళ్ళాక అక్కడ చేసేదేమీ లేదు. ఇష్టంలేని తిండి తింటూ, అర్థంలేని మాటలు వింటూ ఉండడము, ఊరికే విసుగెత్తుతుంది, అంతే. ఐనా, అతనికోసం, వెళ్ళక తప్పదు. నిరుత్సాహంగా, బద్ధకంగా జడ అల్లుకోసాగింది శ్యామల.

ఎనిమిది గంటల కల్లా వారిద్దరూ క్లబ్ లోకి వెళ్ళారు.

అప్పటికే తతిమ్మా ఆఫీసర్లందరూ, తమతమ భార్యలతో వచ్చి ఉన్నారు. రకరకాల నగలు, జరీ చీర అంచులు, ఆ దీపపు కాంతిలో తళుకు తళుకు మని మెరుస్తున్నాయి. శ్యామల ఒక్కతే సాదా చీరతో, నిరాడంబరంగా ఉన్నది. భర్త ప్రక్కనే, ఒక మూల, సోఫాలో కూర్చుని తమాషా చూస్తోంది; తనకు ఈ నాటకంతో ఏమీ ప్రసక్తి లేనట్లు. అవును, నాటకంలాగే ఉంటుంది. క్షణక్షణమూ మారిపోయే వ్యక్తుల హావభావాలు చూడడానికి వింతగా ఉంటాయి. తను తరుచు ఇల్లు విడిచి రాదు కాబట్టి వీరిలో చాలామందిని ఆమె ఇదివరకు ఎరుగదు. అటూ, ఇటూ తిరుగుతూ, ఒక్కొక్కరే తమ వేపు వచ్చినపుడల్లా కామేశ్వరరావును పలుకరిస్తారు. అతడు ఆమెను వారికి పరిచయం చేస్తాడు. ఒక చిరునవ్వుతో, నమస్కారంతో శ్యామల తన బాధ్యత తీర్చుకుంటుంది.

ఉన్నట్టుండి, మీరా వచ్చింది వారున్న చోటకు. కామేశ్వరరావు లేచి నిలబడి, "ఈమె మా ఆఫీస్ సెక్రటరీ శేఖర్ భార్య, మీరా - శ్యామల" అంటూ వారిద్దరినీ పరిచయం చేశాడు. "మీ పాపను కూడా తీసుకురాలేదేమండీ" అని ప్రశ్నించాడు ఆమెను.

"లేదు" అన్నది మీరా, ముక్తసరిగా.

"ఏం, మీరా! నన్ను మరచిపోయావా? శేఖర్ ఏడీ" అని, "మీరాదీను మా అమ్మగారి ఊరే. మేమిద్దరం చిన్ననాటి స్నేహితులం. ఒకే కాలేజీలో చదువుకున్నాము శేఖరు, మేముకూడా" అన్నది భర్తవేపు చూస్తూ. మీరాను

తమప్రక్కనే కూర్చోమన్నది. ఆమె కూర్చుంటుందో కూర్చోదో అని కాస్త సందేహిస్తూ.

మీరా కూర్చుని, కామేశ్వరరావుతో పిచ్చాపాటి మాట్లాడసాగింది. ఆమె చూపులుమాత్రం అప్పుడప్పుడు శ్యామలపై ప్రసరిస్తున్నాయి. శ్యామలను చూచినప్పుడు, మీరా ముఖం చిన్ననాటి స్నేహితురాలిని చూచిన సంతోషంతో వికసింపనూ లేదు; ముభావంతో ముకుళింపనూ లేదు. కాని, ఆమె చూపులోమాత్రం, సరిగా అర్థంకాని వింత భావం కనబడింది. అది అసహనం అనుకోవడం యిష్టంలేదు శ్యామలకు. ఆ చూపు ఆమెకు చిరపరిచితమే. ఎందువల్లనో చిన్నప్పటినుంచీ, మీరా శ్యామలవైపు చూచినప్పుడల్లా ఏదో అయిష్టభావం గోచరించేది ఆమె కళ్ళల్లో. ఎందుకో శ్యామలకు అర్థమయ్యేదికాదు.

శ్యామల పుట్టింటికి ఎదురుగుమ్మమే మీరా పుట్టిల్లు. వారిద్దరిదీ ఇంచుమించు ఒకే వయసు. ఆటపాటలలో తరచు కలుసుకుంటూ ఉండేవారు. కాని మొదటినుంచీకూడా, మీరాకు శ్యామల పొడగిట్టేదికాదు. అది ఏ కారణంచేతనో శ్యామలకు తెలియలేదు. 'నీకెందుకు నేనంటే ఇష్టంలేదూ?' అని ఆమెను ఒకవేళ ప్రశ్నించినా, మీరాకూడా సరిగా చెప్పలేకపోయేదేమో.

మీరా పుట్టింటివారు భాగ్యవంతులు. చిన్నప్పటి నుంచి ఆమె అల్లారుముద్దుగా పెరిగింది. ఎప్పుడూ మంచి మంచి పరికిణీలు కట్టుకుని, విలువైన నగలు సింగారించుకొని అందరిదృష్టినీ ఆకర్షించేది. పిల్లలందరూ మీరా దుస్తులను

నగలను చూచి మెచ్చుకుంటూ, ఆమెను ఎంతో గొప్పగా చూచేవారు. ఎప్పుడూ ఆమె ఇంట్లోనే ఉండి, ఆమెతోనే ఆడుతూ పాడుతూ ఉండేవారు.

శ్యామల పుట్టింటివారిది సామాన్య కుటుంబము. పెద్ద సంసారం. అంచేత ఆమె విషయమై చిన్నప్పటినుంచీ ఎవరూ అంత శ్రద్ధ చూపలేదు. ఆమె అంత రూపసికూడా గాదు. కాని, తనకు విలువైన దుస్తులు కావాలనిగాని, నగలు పెట్టుకోవాలనికాని ఆమె ఎన్నడూ కోరలేదు. తను కట్టుకునే బట్టలు అంత అందంగా లేవని ఎన్నడూ అనుకునేదికూడా కాదు. ఆ విషయమ్మై ఆమెకు అంత పట్టింపులేదు, చిన్నప్పటినుంచీ.

పిల్లలందరూ మీరా యింటికి అంతగా వెళుతూ ఉన్నా, ఆమెకు వెళ్ళాలని ఉండేదిగాదు. ఒకసారిమాత్రం, మీరా పిలిస్తే వెళ్ళింది. ఆవేళ మీరా ఖరీదైన పట్టు పరికిణీ కట్టుకుంది. వెల్ వెట్ జాకెట్టు తొడుక్కుంది. "చూడు! నా పరికిణీ బాగుందా? అన్నది మీరా తన బట్టలు శ్యామలకు చూపిస్తూ. "ఆ" అన్నది. శ్యామల ఇంకేం మాట్లాడలేదు ఎక్కువగా. తక్కిన పిల్లల్లాగా, మెచ్చుకోకపోవడంవల్ల మీరా చాలా చిన్నబుచ్చుకుంది. శ్యామలలో ఏమీ ప్రత్యేకత లేకపోయినా ఏదో నిండుతనం, సహజమైన నెమ్మదీ ఉండేవి. ఆమె ఎప్పుడూ వెకిలిగా నవ్వేదిగాదు. అందరిలాగా అతిగా మాట్లాడేదిగాదు.

శ్యామల అందరి పిల్లలలాగ ఉండకపోవడమే ఆమె లోపమేమో, అందుచేతనే, ఒకవేళ, మీరా ఆమెపై కక్ష

గట్టింది. పనిగట్టుకు శ్యామలను తన ఇంటికి రమ్మని పిలిచి, మళ్ళా ఆమెను తమతో ఆటలలోనికి చేరనియ్యకుండా, తక్కిన పిల్లలను చేర్చుకొని ఆడుకొనేది. కాని, శ్యామల అందుకు ఏమీ బాధపడేదికాదు. ఒంటరిగా, దూరంగా కూర్చునే, వాళ్ళ ఆటలు చూస్తూవుండి, వారంతా ఇళ్ళకు పోయేటప్పుడు తనూ వెళ్ళిపోయేది సంతోషంగానే.

ఆఊళ్ళో చదువు పూర్తయ్యాక, శ్యామల, మీరా కూడా పట్నంలో ఒకే కాలేజీలో చేరారు. అక్కడకూడా, మీరా శ్యామలతో స్నేహభావంతో ఉండటానికి ప్రయత్నించలేదు. కాని, శ్యామల ఏం చేస్తూందో ప్రతి నిమిషం కనిపెడుతూనే ఉండేది. ఎప్పుడూ ఆమెవైపే చూస్తూఉండేది. శ్యామల అటుతిరిగి చూచినప్పుడుమాత్రం ముఖం మరో వైపు త్రిప్పుకునేది. ఏదో తన పని తను చూచుకుంటూ, ఎవరితోనూ అంతగా జోక్యం కలిగించుకోకుండా గడుపుకు పోయేది శ్యామల. మీరా సగం కాలేజీని తనచుట్టూ చేర్చుకుని, ఊరికేకబుర్లుచెపుతూ, గొడవచేస్తూ ఉండేది. నలుగురి దృష్టి ఆకర్షించడం ఆమె కిష్టం. అట్లాగే ఉండేది.

పరీక్షలై, అందరూ ఇళ్ళకు వెళ్ళబోయేముందు కాలేజీలో ఒక టీ పార్టీ జరిగింది, అది శేఖర్ ఇచ్చాడు. అందరినీ పిలుస్తూ, శేఖర్ శ్యామలను 'మీరు తప్పకుండా రావాలని' మరీమరీ కోరాడు. శ్యామలకు మొదటినుంచీ ఇలాంటి పార్టీలు ఏమాత్రం ఇష్టంలేదు. "నేనెవరినీ అంతగా ఎరుగను. నాకు రావాలని లేదు" అని తప్పించుకోవాలనుకున్నది. కాని శేఖర్ "నేనుంటానుగదా, మీరు తప్పక రావాలి" అని పట్టు

బట్టాడు. విధిలేక, శ్యామల టీపార్టీకి వెళ్ళింది. శేఖర్ ఆమె ప్రక్కనే కూర్చున్నాడు. కాస్త అవతల మరో టేబిల్ వద్ద కూర్చున్న మీరా వారి నిద్దరినీ చూచింది. పైకి చిరునవ్వు నవ్వింది, గాని, ఆమె చూపులలో చెప్పలేనంత అయిష్టం కనిపించింది. ఆ తర్వాత ఆమె అతి వింతగా ప్రవర్తించింది. వీరినీ, వారినీ, పేర్లు పెట్టి పిలుస్తూ తనచుట్టూ చేర్చుకుంది. ఏవేవో కబుర్లు చెబుతూ అట్టహాసంగా నవ్వుతూ, అందరినీ కూడా నవ్వించింది. ఆ గల్లంతులో, అక్కడే శ్యామల కూడా ఉన్నట్టు ఒక్కరూ గుర్తించలేదు. శేఖర్ మాత్రం ఆమె ప్రక్కనే ఉండి, ఆమెతో మాట్లాడుతున్నాడు. అది గమనించి, ఈసారి శేఖర్‌నే, బిగ్గరగా పేరుపెట్టి పిలచి "శ్యామల తప్ప నీకెవరూ కనబడడం లేదులా ఉంది. అసలు ఆమె కోసమేనా ఈ పార్టీ అంతా" అంది ఏదో వ్యంగ్యంగా. నవ్వుతూ అందరూ గట్టిగా నవ్వారు. శ్యామలకేసి తిరిగి చూశారు. ఆ మాటలకు సిగ్గుతో శ్యామల ముఖం ఎర్రగా కందిపోయింది. ఎందుకొచ్చానా ఇక్కడకు అనుకుంది. ఐనా, చేసేది లేక, కాసేపు ఉండి, లేచి వెళ్ళిపోయింది. మీరా ఎందుకల్లా తనను అవమానించటానికి ప్రయత్నించిందో ఎంత ఆలోచించినా, ఆమెకర్థం కాలేదు.

ఆ తరువాత, మీరా తరుచు శేఖర్‌తో కనిపిస్తూ ఉండేది. పని ఉన్నా లేకపోయినా, శేఖర్‌తో కలసి శ్యామల వద్దకు వచ్చి, ఆమెను పలుకరించి వెళుతూ ఉండేది. అది ప్రత్యేకంగా శ్యామలను బాధపెట్టటానికే వచ్చినట్లుండేది. మీరా అపోహ పడుతున్నదని ఆమె మనసు స్థిమిత పరచా

లని ఎంతో అనుకునేది శ్యామల. కాని అలా మనసిచ్చి మాట్లాడడానికి కాస్త అయినా అవకాశం ఇచ్చేది కాదు ఆమె. పైగా, మీరా తనవైపు చూచినప్పుడల్లా ఎంతో అయిష్టత స్ఫురించింది. ఇంత అయిష్టతకు కారణం ఊహించ లేకపోయింది శ్యామల. కొంచమైనా చనువిస్తే, కారణం కనుక్కొని, ఆమె మనస్సు మార్చడానికి ప్రయత్నించవచ్చు. తనలో ఏమి లోపమో తెలుసుకుని ఆ లోపం దిద్దుకోవచ్చు. ఏమి చెయ్యాలో తెలియక శ్యామల చాలా బాధపడింది. లేనిపోని అపోహలు పెట్టుగోకుండా, మీరా తనతో స్నేహంగా ఉంటే ఎంతో బాగుండుననిపించింది, ఎన్నోసార్లు. కాని, ఈ పరిస్థితులలో తను ఏం చెయ్యకలదు?

కాలేజీ చదువు పూర్తయ్యాక, మీరా శేఖర్ని పెళ్లాడింది, ఆతర్వాత శ్యామలకు కూడా పెండ్లైంది. మళ్ళా, ఇన్నాళ్ళకి, ఈ ఊళ్లో ఆమెకు మీరా తటస్థపడింది.

* * *

డిన్నర్ నుంచి ఇంటికి వచ్చేసరికి రాత్రి పదకొండు దాటింది. పడుకోబోతూ ఉంటే కామేశ్వరరావు అన్నాడు.

"మీరా చూడు! ఎంత చలాకీగా ఉంటుందో! ఆమె మూలాన పార్టీ ఎంతో కళకళలాడింది. అందరిలో, చాలా తెలివైనది" అన్నాడు.

శ్యామల ఏమీ అనలేదు. అతను చెప్పినది నిజమే అనిమాత్రం అనుకుంది. మీరా అందరితోనూ స్నేహంగా ఉంటుంది ఒక్క తనతో తప్ప. తను ఎంత ప్రయత్నించినా ఆమెలా ఉండలేదు. తనకూ, మీరాకు స్వభావంలో ఎంత

లేడా ఉంది! తను ఇద్దరి స్వభావాలమధ్య, ఉత్తర ధ్రువానికీ దక్షిణ ధ్రువానికీ మధ్య ఉన్నంత దూరముంది - అనుకున్నది.

ఆవేళ డిన్నర్‌లో కలుసుకున్న తర్వాత చాలాసార్లు వారిద్దరూ కలుసుకున్నారు. రెండు మూడుసార్లు మీరాయే శ్యామల ఇంటికి వచ్చింది. కాని, శ్యామలను చూడడానికి వచ్చినా, మీరా కామేశ్వరరావుతోనే ఎక్కువగా సరదాగా మాట్లాడేది. ఆమె వచ్చి వెళ్ళినతర్వాత, ప్రతిసారి ఆమెను అమితంగా పొగడుతూఉండేవాడు అతను. ఈ ధోరణిచూసి శ్యామల కొంచం కంగారుపడింది. ఇదివరకు తనమీద అయిష్టంచేత పనికట్టుకొని శేఖర్‌ని ఆకర్షించినట్లే యిప్పుడు మీరా కామేశ్వరరావును ఆకర్షించటానికి ప్రయత్నిస్తోందా అనిపించింది శ్యామలకు.

ఉన్నట్టుండి, శేఖర్‌కి ఆ ఊరినుంచి మరో ఊరికి బదిలీ ఐంది. ఇది మీరా ప్రోద్బలంవల్లనే జరిగిందనీ, శేఖర్ అడగబట్టి తనూ ఈ బదిలీ కావడానికి సహాయం చేశాననీ కామేశ్వరరావు అన్నాడు శ్యామలతో. ఊరు వెళుతున్నానని చెప్పడానికి వచ్చిన మీరా, "నాకు ఈ ఊళ్లో ఉండాలని లేదు. ఈ బదిలీకి మీవారుకూడా చాలా సాయపడ్డారు. అందుకు నేను కృతజ్ఞురాలను" అన్నది. తను ఉన్నచోట ఉండడానికి ఇష్టంలేకే మీరా వెళ్ళిపోతున్నదనుకున్నది శ్యామల. మాటలలో ఏమీ ఎత్తిపొడుపు స్ఫురించలేదు శ్యామలకు. ఆవేళ మీరా కళ్ళల్లో మునుపటి అయిష్టంకూడా అంతగా కనబడలేదు. ఏదో నిరుత్సాహంమాత్రం కనిపించింది. మీరా

ఎప్పటికి మారదా, తనతో స్నేహంగా ఉండదా అను కొన్నది శ్యామల.

ఆ తర్వాత మూడేళ్ళదాకా మీరా సంగతి ఏమీ తెలియలేదు శ్యామలకు. శ్యామల సంసారం, చల్లగా ఏ ఒడిదుడుకూ లేకుండా సాగిపోతున్నది.

ఆవేళ సంక్రాంతి. శ్యామల ఇల్లంతా చక్కగా ముగ్గులు పెట్టింది. తలంటుకొని, కళ్ళనిండా కాటుక పెట్టుకొంది. కొత్తబట్టలు మడతవిప్పి అంచులకు పసుపు పెడుతూ వుండగా పోస్ట్‌వాడు 'పోస్ట్' అంటూ కేక వేసి గుమ్మంలో ఉత్తరంపడవేసి వెళ్ళాడు. ఉత్తరం తనపేరట ఉంది. పై దస్తూరీమాత్రం ఎవరిదో ఆమెకు స్ఫురించలేదు. బెంగుళూరు ముద్ర. బెంగుళూర్‌లో ఎవరున్నారు మాకు తెలిసినవారు అనుకుంటూ ఉత్తరం విప్పి చదువుకుంది.

అది మీరా వ్రాసింది!

"నేను ఇంకా నీకు జ్ఞాపకం ఉన్నాననే అనుకుంటా. నాకు ఆరు నెలలుగా సుస్తీగా ఉంటున్నది. కాన్సర్ అని తేలింది. ఈ వ్యాధి నయంగాదు. ఓపికతో, ఆఖరి నిమిషం కోసం కనిపెట్టుకుండాలి, అంతే.

నాకు ఈ జబ్బు వచ్చినప్పటినుంచీ నీవే మరీమరీ జ్ఞాపకం వస్తున్నావు. ప్రతి నిమిషమూ నీ రూపమే నా కళ్ళ ఎదుట మెదులుతూంది. నిన్ను ఒకసారి చూడాలని ఉంది, చాలా. నీవు రాగలవా?

నా జబ్బు నయం కాదని తెలిసి, మొదటిసారిగా, ఆఖరిసారిగా నిన్ను ఒకటి అర్థిస్తున్నాను! మా పాప సంరక్షణ

భారం నీపై మోపుతున్నాను. నాకు నీయందున్న గౌరవం, నా భర్తయందుగాని, తల్లి దండ్రులయందుగాని, ఇంకెవరి యందు గాని లేదు. నీ వద్ద ఉంటే నా పాపకు ఎటువంటి లోటూ రాదని నాకు తెలుసు. ఈ మాట మనస్ఫూర్తిగా అంటున్నాను.

మరొక్క మాట! నేను నీలా ఉండాలని ఎంతో ప్రయత్నించాను. నీ నెమ్మది, ఆరిందా తనము, ఓర్పు నాలో లేవని నాకు నీమీద కోపంకూడా వస్తూ ఉండేది. ఆ కారణంగా, వింతగా ప్రవర్తించి, తరుచు నీమనస్సుకు బాధకల్గించాను. ఎన్నడో చెప్పవలసినది ఇప్పటికైనా చెప్పగలిగినందుకు నా మనస్సుకు శాంతి కలుగుతోంది. నేను అలవరచుకోలేని నీ సద్గుణాలు పోనీ, పాపన్నా అలవరచుకొంటుంది.

ఇంతే,

మీరా."

శ్యామల కళ్ళు గిర్రున నీళ్ళు తిరిగాయి. ఎంత వింత స్వభావము అనుకుంది. మీరాపై పట్టరాని జాలి కలిగింది.

కొత్తబట్టలు అవతల ఉంచి, ప్రయాణానికి కావలసిన బట్టలు సర్దుకో నారంభించింది.